సాక్షి
నిజామాబాద్

ఆదివారం । 14 । మే । 2023



తీరనున్న జంతువుల దాహం

ఎండాకాలం దృష్ట్యా అటవీశాఖ ఆధ్వర్యంలో అడవుల్లో జంతువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- 8లో ▸



ప్రయాణికుల భద్రతకు చర్యలు

ఆటోల్లో ప్రయాణించే వారి భద్రత కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆటో డ్రైవర్లకు, ఓనర్లకు అవగాహన కల్పించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.9 /25.4

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ధాన్యం తరలింపులో అలసత్వంపై నిరసన

- లారీలకు అడ్డుపడిన రైతులు



మాక్లూర్ : కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యాన్ని కాంటాలు వేసి పది రోజులు గడుస్తున్నా లారీలు రావటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని అమ్రాద్ సోసైటీ పరిధి అమ్రాద్ తండాకు చెందిన రైతులు మానిక్‌భండార్ పరిధిలోని మార్కెట్ కమిటీ చెక్‌పోస్ట్ వద్ద లారీలకు అడ్డం పడుకుని నిరసన తెలిపారు. కల్లాలపై నెలల తరబడి నిరీక్షించి పండించిన పంటను అమ్ముకునే దుస్థితి ఏమిటని రైతులు మండిపడ్డారు. వారానికి ఒకసారి వచ్చిన లారీలు తిరిగి మళ్లీ రావటం లేదని ఇదేమిటనే ప్రశ్నిస్తే రైస్ మిల్లర్లు సంచులను దించుకోనప్పుడు తామేమి చేయాలంటున్నారని రైతులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ విషయమై అమ్రాద్ సాసైటీ సీఈవో గంగారాంను వివరణ కోరగా లారీల కొరత ఉందన్నారు. ఐదు రోజులుగా లారీల కోసం ప్రయత్నించగా ఈ రోజు రెండు లారీలు వ స్తున్నాయన్నారు. ఆలస్యం జరిగినప్పటికీ రై తుల ధాన్యం అంతటిని తరలిస్తామన్నారు.

సజ్జలకు ఒప్పందం ప్రకారమే ధర



మోర్తాడ్(బాల్కొండ): సజ్జ పంటకు ఒప్పందం ప్రకారమే ధరను వ్యాపారులు వర్తింప చేస్తున్నారు. సీడ్ పంపిణీ సమయంలోనే వ్యాపారులకు రైతులతో క్వింటాలు సజ్జలకు రూ.4 వేల నుంచి రూ.4,500 వరకు ధర ఒప్పందం కుదిరింది. సజ్జ పంట కోత దశకు చేరుకోగా సీడ్ వ్యాపారులు మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ఒప్పందం ప్రకారం ధరను అమలు చేస్తున్నారు. మోర్తాడ్ మండలంలోని శెట్‌పల్లి రైతులకు మాత్రం సీడ్ వ్యాపారి రూ.200 చొప్పున ఎక్కువ ధర చెల్లించడం గమనార్హం. ఈ గ్రామంలో సజ్జలకు క్వింటాలుకు రూ.4,200 ధర ఒప్పందం కుదురగా కొనుగోలు సమయంలో వ్యాపారి రూ.4,400 ధర నిర్ణయించారు. యాసంగి సీజనుకు గాను జిల్లాలో దాదాపు 12వేల ఎకరాల్లో సజ్జ పంట సాగైంది. గతంలో క్వింటాలు సజ్జలకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ధర పలికింది. కొన్నేళ్ల నుంచి సజ్జలకు రూ.4,500 మించి ధర లభించడం లేదు.

రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌లో సాంకేతిక లోపంతో నాలుగు గంటల ఆలస్యం అయింది. ఉదయం ఈ రైలు నిజామాబాద్‌కు చేరుకొని ఇక్కడి నుంచి బోధన్ వెళ్తుంది. మధ్యాహ్నం 2:15 గంటలకు నిజామాబాద్ నుంచి బయలు దేరుతుంది. కానీ శనివారం సాయంత్రం 4:30 గంటలకు చేరుకుంది. దీంతో బోధన్ ట్రిప్పును రైల్వే అధికారులు రద్దు చేశారు. రైల్వేస్టేషన్‌లో సిబ్బంది ఇంజిన్‌కు మరమ్మతులు చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు నిజామాబాద్ నుంచి బయలుదేరిన రైలు మాధవనగర్ వద్ద సమస్య రావడంతో మళ్లీ నిలిచిపోయింది. తర్వాత మరమ్మతులు చేయడంతో రైలు వెళ్లింది.

'మంచిని ధైర్యంగా ఆచరించండి'

- వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో మాధవనంద సరస్వతి



కామారెడ్డి అర్బన్: హిందూ ధర్మరక్షణ కోసం మంచిని ధైర్యంగా ఆచరించాలని తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతీ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి దేవీ విహార్‌లో శ్రీవీరాంజనేయస్వామి దేవతా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన నవగ్రహ మండల దేవతా హోమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన భక్తుల నుద్దేశించి మాట్లాడి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం హనుమాన్‌జయంతి సందర్భంగా స్థిర ప్రతిష్ఠాపన నిర్వహించడం విశేషమన్నారు.

అమ్మ బిడ్డిన జీవితం

అమ్మ అంటే ఓ అనుభూతి... ఓ అనుబంధం... ఓ ఆప్యాయత... ఓ ఆత్మీయత. బిడ్డకు బాధ కలిగిందన్న విషయం ముందు అమ్మకే తెలుస్తుంది. ఆకలి అవుతుందన్న విషయం ముందు అమ్మే పసిగడుతుంది. తన బిడ్డ విజయాలు సాధించినప్పుడు అమ్మ ఆనంద పరవశురాలవుతుంది.. అందుకే అమ్మే జీవితం. అమ్మే సర్వస్వం. నేడు మదర్స్‌డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు..



మాతృ దినోత్సవం

కన్న పేగును కంటికి రెప్పలా..

- వైకల్యమున్న చిన్నారులను కాపాడుకుంటున్న తల్లులు
- ఉమ్మడి జిల్లాలో మూడువేలకు పైగా ప్రత్యేకావసరాలున్న పిల్లలు



ఆర్మూర్ : నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కలిపి సున్నా నుంచి 18 ఏళ్ల వయసు ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సుమారు 3,200 మంది ఉన్నట్లు సమగ్ర శిక్ష సహిత విద్యావిభాగం అధికారులు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి మండలానికి ఒక భవిత కేంద్రం ఉంటుంది. ఇందులో ప్రత్యేకావసరాలు ఉన్న చిన్నారులకు శిక్షణనిస్తుంటారు. బుద్ధి మాంద్యం, వినికిడి లోపం, పూర్తి అంధత్వం, పాక్షిక అంధత్వం, శారీరక వికలాంగులు, సెరిబ్రల్ పాల్సీ, ఆటిజం, బహుళ వైకల్యం, భాషణలోపం, అభ్యసన లోపం తదితర వైకల్యాలతో బాధపడుతున్న పిల్లలు ప్రత్యేకావసరాలు కావాల్సిన చిన్నారులుగా గుర్తిస్తారు. అయితే ఆ బిడ్డలను జీవితకాలం పాటు కంటికి రెప్పలా కాపాడుకుంటున్న కన్నతల్లి ప్రేమకు వెలకట్టలేం. మేనరిక వివాహాలు, వైద్యుల నిర్లక్ష్యం జన్యుపరమైన లోపాలు, రోడ్డు ప్రమాదాల్లో గాయాలు తదితర కారణాలతో తమ పిల్లలు వైకల్యానికి గురవుతున్నా పుట్టెడు దుఃఖాన్ని కడుపులో దాచుకొని పిల్లలను పెంచుతున్నారు.

ఐదుగురిని ప్రయోజకులను చేసిన తల్లి



నలుగురు కొడుకులతో సుజాత

మాచారెడ్డి: ఐదుగురు పిల్లలు. స్కూల్‌కు వెళ్తున్నారు. భర్త మరణం ఆమెను ఆందోళనకు గురి చేసింది. పిల్లల్ని పెద్ద చేయడానికి నానా కష్టాలు పడింది. బీడీలు చుట్టింది. తీరొక్క కష్టం జేసి ఐదుగురినీ పెంచి పెద్ద చేసింది. ఆమె కష్టానికి ఫలితం దక్కింది. అందరూ ప్రయోజకులయ్యారు. మాచా రెడ్డి మండలం గన్‌పూర్(ఎం)కు చెందిన దుంపేటి భాస్కర్, సుజాతలకు నలుగురు కొడుకులు, ఒక కూతురు. 2007లో భర్త భాస్కర్ అనారోగ్యానికి గురై మరణించాడు. అప్పటికే ఆయన వైద్యం కోసం ఉన్న ఆస్తులన్నీ అమ్మాల్సి వచ్చింది. పెద్ద కొడుకు మహేశ్ ఇంటర్ చదువుతున్నాడు. రెండో కొడుకు రాజేశ్ తొమ్మిదో తరగతి, కవలలైన విజయ్, వినయ్‌లు ఏడో తరగతి, కూతురు రమ్య పదో తరగతి చదువుతున్నారు. అప్పుడు మొదలయ్యాయి ఆమెకు కష్టాలు. కష్టాలు, కన్నీళ్లను దిగమింగుకుని పెద్ద కుమారుడు మహేశ్‌ను డిగ్రీ దాకా చదివించింది. తల్లి కష్టాన్ని చూసిన మహేశ్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగంలో చేరాడు. రాత్రింబవళ్లు కష్టపడుతూ తల్లికి ఆసరా అయ్యాడు. అసిస్టెంట్ మేనేజర్ హోదాలో పనిచేస్తున్నాడు. రెండో వాడు రాజేశ్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదివి ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కవల పిల్లలు వినయ్, విజయ్‌లు ఇంజినీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. కూతురు రమ్యను డిగ్రీ, బీఈడీ చదివించి పెళ్లి చేసి పంపారు. అమ్మ వల్లే తాము ఎదిగామని, అమ్మకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని ఆ పిల్లలు పేర్కొన్నారు.

వ్యవసాయం చేసి.. ఎస్సైని చేసి..



నిజామాబాద్ అర్బన్ : కడుపులో ఏణ్నెళ్ల బిడ్డ ఉండగానే భర్త అకాల మరణం.. దిక్కుతోచని పరిస్థితిలో తనకున్న మూడెకరాల పొలాన్ని నమ్ముకుని సాగు బాట పట్టిందా తల్లి.. తన బిడ్డ భవిష్యత్తు కోసం ఎండనక.. వాననక.. కష్టపడి పంట సాగు చేస్తూ కొడుకును చదివించి ఎస్సైని చేసింది. ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన దొరగారి హనుమవ్వ విజయగాథ ఇది. కడుపులో బిడ్డ ఉండగానే భర్త చనిపోగా అత్తగారింటికి వచ్చి వ్యవసాయం మొదలు పెట్టింది హనుమవ్వ. మూడెకరాల్లో పంటలను సాగు చేస్తూ కొడుకును చదివించింది. మధ్యలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాగా చివరికి ఎకరంన్నర భూమిని సైతం విక్రయించింది. అయినా దిగులు చెందక ఉన్న పొలంలోనే శ్రమించింది. సాగుచేసిన పంటలను అమ్మడానికి నిజామాబాద్ గంజ్‌కు వెళ్లేది. పొలం పనులను నేటికీ హనుమవ్వ ఒక్కతే చేసుకుంటుంది. తన కొడుకు ఎస్సై అయినా కూడా తనకు జీవితాన్ని చూపిన వ్యవసాయాన్ని మాత్రం మరవలేదు. తల్లి పడ్డ కష్టాన్ని వృథా చేయకుండా కొడుకు రాజారెడ్డి సైతం ఉన్నత చదువులు చదివి మొదట కానిస్టేబుల్‌గా ఎంపికై అనంతరం ఎస్సై పరీక్షలు రాసి క్వాలిఫై అయ్యారు. ప్రస్తుతం నవీపేట ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు.

కష్టం అనిపించలే..

ఎడునెలల కొడుకు కడుపులో ఉన్నప్పుడే నా భర్త మరణించాడు. చాలా కఠినమైన పరిస్థితి ఉండేది. ఆడదానిగా నేను చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాను. పొలం పనులు చేస్తూ కొడుకు ప్రయోజకుడిని చేయాలనే తపన మాత్రమే నాలో ఉండేది. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చాను. నేటికి కూడా వ్యవసాయం చేస్తున్నా. నా కొడుకు ఎస్సై కావడం ఎంతో సంతోషంగా ఉంది. - హనుమవ్వ, పిప్రి

కొడుకు కోసం ఆయాగా..

- సేవాసంస్థలో చేరిన తల్లి
- కొడుకుతో పాటు ఇతర వికలాంగ చిన్నారులకు సేవలందిస్తున్న రాజేశ్వరి



నిజామాబాద్ నాగారం : కొడుకు పుట్టాడని ఆనందించేలోపే బిడ్డకు వచ్చిన వైకల్యం ఆమెను మనోవేదనకు గురిచేసింది. అయినా కన్నతల్లి ప్రేమ ముందు అంగవైకల్యం చిన్నబోయింది. అమ్మగా మానసిక వికలాంగ బిడ్డను పోషిస్తూనే అలాంటి మరెందరో చిన్నారులను లాలిస్తోంది ఆ తల్లి.. ఆమె పేరు రాజేశ్వరి. జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీలోని మానసిక, అంధుల పాఠశాలలో ఆయాగా చేరి ప్రస్తుతం టీచర్‌గా పనిచేస్తున్న రాజేశ్వరి తన కొడుకును అందులోనే చదివిస్తూ మరెందరో చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుతోంది.

తల్లిగా కష్టాలెన్నో..

కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరీకి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఆరోగ్యంగా ఉన్నారు. చిన్న కుమారుడు భార్గవ్ పుట్టుకతోనే మానసిక శారీరక వికలాంగుడు. కొడుకు ఆరోగ్యం బాగు చేయించాలని 1999లో కలెక్టర్ కార్యాలయానికి వచ్చింది. వికలాంగుల శాఖ ఏడీని కలిసి తన కుమారుడి సమస్య విన్నవించడంతో కంఠేశ్వర్ ప్రాంతంలో అలాంటి పిల్లల కోసం ప్రత్యేకంగా స్కూల్ ఉందని అందులో చేర్పించాలని సూచించారు.

కొడుకును చూసుకుంటూనే..

రాజేశ్వరి కొడుకు భార్గవ్ పరిస్థితి చూసిన స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి చేర్చుకోవడానికి అవకాశమిచ్చారు. దీంతో రాజేశ్వరి తన ఇద్దరు కుమారుల కోసం కుటుంబాన్ని వదిలి రావాలని నిశ్చయించుకుని.. స్నేహ సొసైటీలోనే ఏదైనా పని ఇవ్వాలని కోరింది. అయితే నీ బిడ్డను బాగా చూసి ఇతరులను నిర్లక్ష్యం చేస్తావని మొదట్లో నిర్వాహకులు వద్దని వారించినా చివరికి వారిని ఒప్పించి ఆయాగా స్నేహసొసైటీలో చేరింది. రూ. 500లకు ఆయాగా అందులో చేరిన రాజేశ్వరి అక్కడి నుంచే 10 పూర్తిచేసి ఓపెన్‌లో డిగ్రీ చేసి స్పెషల్ చిల్డ్రన్ కోసం మూడు నెలల కోర్సు హైదరాబాద్‌లో పూర్తి చేసింది. అలాగే అంధుల కోసం బ్రెయిలీలో శిక్షణ తీసుకుంది. స్పెషల్ బీఈడీ పూర్తిచేయడంతో స్నేహ సొసైటీలోనే టీచర్‌గా పని చేస్తుంది. ఎంఏ కూడా పూర్తి చేసింది. తన బిడ్డకు శిక్షణ ఇప్పించడంతో పాటు ఇతర పిల్లలనూ కంటికి రెప్పలా చూసుకుంటుంది. ఆమె కుమారుడు ప్రస్తుతం మాట్లాడడం, ఇతర పనులు చేసుకుంటున్నాడు. తనకు తన బిడ్డలకు ఆశ్రయమిచ్చిన స్నేహ సొసైటీలోనే గత 24 ఏళ్లుగా కుక్ నుంచి టీచర్ స్థాయికి ఎదిగింది. రూ. 500 జీతం నుంచి రూ. 19 వేల జీతం నెలకు అందుకుంటుంది.

స్నేహ సొసైటీ జీవితాన్నిచ్చింది

నేను పుట్టెడు దుఃఖంతో స్నేహ సొసైటీలో అడుగు పెట్టాను. అప్పటి నుంచి నా జీవితం మారిపోయింది. ఈరోజు నేను స్థాయికి రావడానికి ప్రధానంగా నిర్వాహకులు సిద్ధయ్య, జ్యోతి కారణం. నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎంతో కష్టపడి ఇష్టపడి పనిచేసి, చదువుకుంటూ ఈ స్థాయికి వచ్చాను. నాకు స్నేహ సొసైటీ మనో జీవితాన్నిచ్చింది. - రాజేశ్వరీ, టీచర్, స్నేహ సొసైటీ

కాంగ్రెస్‌లో జోష్

- కర్ణాటక విజయంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం
- జిల్లావ్యాప్తంగా నాయకులు, కార్యకర్తల సంబురాలు
- ఇప్పటికే జిల్లాలో రేవంత్‌రెడ్డి పాదయాత్రతో ఊపు
- అంతకుముందే ఉమ్మడి జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గంలో రాహుల్ భారత్ జోడో యాత్ర



నగరంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణుల సందడి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆ పార్టీ జిల్లా శ్రేణుల్లో జోష్ నెలకొంది. జిల్లాలోని అన్ని మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. బాణసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. పక్కరాష్ట్రం కావడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత గెలుపు ప్రభావం తెలంగాణపై పడుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లో మార్పు మొదలైందని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించుతారని అంటున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో పార్టీ కేడర్ స్తబ్దుగా ఉన్న సందర్భంలో జుక్కల్ నియోజకవర్గంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన భారత్ జోడో యాత్ర విజయవంతమైంది. తర్వాత మార్చిలో ఉమ్మడి జిల్లాలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన పాదయాత్ర సైతం సక్సెస్ అయింది. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉరిమే ఉత్సాహం నెలకొంది. వ్యవసాయం ఎక్కువగా ఉన్న జిల్లా కావడంతో రేవంత్ కమ్మర్‌పల్లి మండలంలో, ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రైతుల సమస్యలు విన్న రేవంత్ రాష్ట్రంలో ప్రత్యేకంగా రైతు సమస్యలపై 'రైతు కమిషన్' ఏర్పాటు చేస్తామని ఇక్కడి నుంచే ప్రకటించారు. దీంతో పాటు ధరణి రద్దు విషయమై పార్టీ శ్రేణులు జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రేవంత్ పర్యటన అనంతరం టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్ విషయమై సైతం పార్టీ శ్రేణులు జిల్లాలో భారీగా ఆందోళనలు నిర్వహించారు. పెట్రో ధరల పెంపుపై ఆందోళనలు జరిగాయి. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాలతో తిరుగుతున్నారు. ఇక అకాల వర్షాలకు తడిసిన పంట నష్టంపై రైతులను కలుస్తూ, పరిహారం కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



రాహుల్ గాంధీ భారత్ జోడో లక్ష్యం నెరవేరే దిశగా మొదట హిమాచల్‌ప్రదేశ్‌లో, తాజాగా కర్ణాటకలో అడుగులు మొదలయ్యాయి. రాబోయే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుంది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో చీకటి మిత్రులైన మోదీ, కేసీఆర్‌లకు కచ్చితంగా షాక్ తగులుతుంది. తెలంగాణ ప్రజలు కర్ణాటకలో ఇచ్చిన తీర్పును పునరావృతం చేస్తారు. కర్ణాటకలో 40 శాతం కమీషన్ ప్రభుత్వాన్ని దించేసిన కన్నడ ప్రజలు, తెలంగాణలోనూ 30 శాతం కమీషన్ తీసుకుంటున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేస్తారు. ఈ విజయం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపడంతో పాటు నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేసేలా చేస్తుందన్నారు. కర్ణాటకలో డీకే శివకుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎలా అధికారంలోకి వచ్చిందో, అదేవిధంగా తెలంగాణలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం.

జేపీఎస్‌ల సమ్మె విరమణ

- సీఎస్ ఆదేశాలతో వందశాతం విధుల్లోకి చేరిన ఉద్యోగులు
- ఉన్నతాధికారులకు నివేదించిన డీపీవో జయసుధ



మెండోరాలో జాయినింగ్ రిపోర్ట్ ఇస్తున్న జేపీఎస్

సుభాష్‌నగర్ : తమ డిమాండ్ల సాధన కోసం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మెను శనివారం విరమించారు. జిల్లా వ్యాప్తంగా 100 శాతం మంది జేపీఎస్‌లు ఎంపీడీవో, డీపీవో కార్యాలయాల్లో రిపోర్ట్ చేసి విధుల్లో చేరారు. అనేక మలుపుల తర్వాత జేపీఎస్‌లు సమ్మెను ముగించారు. శనివారం 12 గంటల్లోపు విధుల్లో చేరకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాగా జిల్లాలో 421 మంది జేపీఎస్, వోపీఎస్‌లు విధుల్లో చేరినట్లు ఇప్పటికే డీపీవో జయసుధ ఉన్నతాధికారులకు నివేదించారు.

16 రోజులు కొనసాగిన సమ్మె..

జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, కేడర్ స్ట్రెంత్‌ను నిర్ధారించి ప్రకటించాలని తదితర డిమాండ్లతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గత నెల 28 నుంచి సమ్మె బాట పట్టారు. సమ్మె ప్రారంభించిన నాటి నుంచి అనేక మలుపులు తిరిగింది. పలుమార్లు ఉన్నతాధికారులు, మంత్రి, కలెక్టర్ల వద్ద చర్చలు జరిగాయి. తమ డిమాండ్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని జేపీఎస్‌లు పట్టుబట్టగా, విధుల్లో చేరిన తర్వాతే డిమాండ్లపై చర్చిద్దామని మంత్రి తేల్చిచెప్పారు. ఈనేపథ్యంలో జేపీఎస్‌లు సమ్మె కొనసాగించాలని నిర్ణయించారు. 16 రోజులపాటు సమ్మె సాగింది.

సీఎస్ ప్రకటనతో..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం మధ్యాహ్నం 12 గంటల్లోపు విధుల్లో చేరాలని, లేకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశాలిచ్చారు. దీంతో జేపీఎస్‌లో పునరాలోచనలో పడ్డారు. విధుల్లో చేరిన తర్వాత డిమాండ్లపై చర్చిద్దామని చెప్పడంతో సమ్మె విరమించినట్లు తెలిసింది. చివరి నిమిషంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 391 మంది జేపీఎస్, 30 మంది ఓపీఎస్‌లు విధుల్లో చేరుతున్నట్లు జాయినింగ్ లెటర్లు ఎంపీడీవో, డీపీవో కార్యాలయంలో అందజేశారు. సీఎస్ ప్రకటనతో జేపీఎస్ పరీక్ష రాసి క్వాలిఫై అయిన 15 మంది వరకు ఉద్యోగం కోసం డీపీవో కార్యాలయంలో సంప్రదించినట్లు తెలిసింది. కాగా ఇదేవిషయమై డీపీవో జయసుధను సంప్రదించగా, జిల్లాలో వందశాతం మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరారని తెలిపారు. సోమవారం నుంచి విధులకు హాజరుకానున్నారన్నారు.

పడిపోతున్న ఉత్తీర్ణత శాతం

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గతేడాది కంటే గణనీయంగా తగ్గుదల



నిజామాబాద్‌అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ప్రతి ఏటా ఉత్తీర్ణత శాతం పడిపోతుంది. గతేడాది పోలిస్తే దాదాపు సగం కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది. బాల్కొండ కళాశాలలో సెకండియర్‌లో గతేడాది 78.14 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ప్రస్తుతం 10.62 శాతానికి పడిపోయింది. ఫస్టియర్‌లో 215 మంది పరీక్షలు రాయగా 12 మంది మాత్రమే పాసయ్యారు. వర్ని జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 59 మంది పరీక్షలు రాయగా ముగ్గురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. డిచ్‌పల్లి జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో 178 మంది పరీక్షలు రాయగా 15 మంది మాత్రమే పాసయ్యారు. ధర్పల్లి కాలేజీలో 151 మంది పరీక్షలు రాయగా 18 మంది పాసయ్యారు.

పర్యవేక్షణ లేక..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పడిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 15 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 450 వరకు లెక్చరర్లు పనిచేస్తున్నారు. ఇందులో కాంట్రాక్టు, రెగ్యులర్, గెస్ట్ లెక్చరర్లు కూడా ఉన్నారు. ఇటీవల 125 మంది రెగ్యులరయ్యారు. కానీ విద్యార్థులు నిత్యం కళాశాలకు రాకపోవడం, దీనికి తోడూ లెక్చరర్లు గైర్హాజరు ప్రతి రోజు కొనసాగడం, కళాశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఉత్తీర్ణత శాతం తగ్గిపోతుంది. లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు ఏడాదికిపైగా కళాశాలలకు రావడం లేదు. ఇందులో చాలా మంది లెక్చరర్లు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, కోచింగ్ సెంటర్లలో పనిచేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం

కళాశాల	ఫస్టియర్‌లో ఉత్తీర్ణత శాతం	సెకండియర్‌లో ఉత్తీర్ణత శాతం
కోటగిరి	82.00	90.20
భీమ్‌గల్	55	86.68
మోర్తాడ్	70.00	92.26
బాల్కొండ	6.00	10.62
మాక్లూర్	47	85.51
ఐయిలాపూర్	14	41.07
కోటగల్లి (నిజామాబాద్)	34.00	50.90
ఆర్మూర్	28	41.64
బోధన్	29.00	45.45
శక్కర్‌నగర్	27.00	38.26
వర్ని	5.00	28.57
బాలుర (ఆర్మూర్)	11.00	31.31
ధర్పల్లి	12.00	67.78
బాలురలు (నిజామాబాద్)	7.00	19.14
డిచ్‌పల్లి	8.00	26.51

చర్యలు చేపడుతాం..

ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఫలితాలు తగ్గిపోతున్నాయి. దీనిపై పరిశీలన చేపడుతాం. కారణాలు తెలుసుకొని మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపడుతాం. - రఘురాజ్, డీఐఈవో

క్లుప్తంగా

కర్ణాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి గద్దెనెక్కిన బీజేపీకి అక్కడి ఓటర్లు చెంపపెట్టులాంటి తీర్పును వెలువరించారని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ అప్రజాస్వామిక, నియంతృత్వ, మతతత్వ విధానాలను ప్రజలు తిప్పికొట్టి ఆ పార్టీకి ఘోరి కడతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. మతతత్వాన్ని రెచ్చగొట్టి, ప్రజలను మాయ మాటలతో లోబర్చుకుని, భ్రమల్లో ముంచాలనే ఆ పార్టీ క్షుద్ర విద్యలను ప్రజలు తిప్పికొడతున్నారని, బీజేపీ నాయకుల నాటకాలు ఇకపై సాగబోవని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీని బొందపెట్టడం ఖాయమని, కర్ణాటకలో ఊహించిన ఫలితాలే వచ్చాయన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర బీజేపీదని ఆరోపించారు. దేశంలో బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టేందుకు ప్రజలు రెడీగా ఉన్నారని, అందుకు కర్ణాటక ఫలితాలే నిదర్శమని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



ఖలీల్‌వాడి: వచ్చే ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ జోస్యం చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుతో జిల్లా పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, సీట్లు పంపిణీ చేసి నృత్యాలు చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్, పీసీసీ సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్ యాదవ్, రాజ నరేంద్ర గౌడ్, ప్రీతం, రామకృష్ణ, వినయ్, సంతోష్, విజయ్‌పాల్‌రెడ్డి, నిఖిల్ రెడ్డి, సయ్యద్ అష్రాఫ్, శివ, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. శనివారం ఆయన నివాసం నుంచి వినాయక్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.



తీరనున్న జంతువుల దాహం



వర్ని ఫారెస్టులో ట్యాంకర్ ద్వారా గుంతలో నీటిని పోస్తున్న దృశ్యం



మంచిప్ప అడవుల్లో సాసర్‌పిట్ వద్ద దాహం తీర్చుకుంటున్న చిరుతలు(ఫైల్)

- సాసర్‌పిట్లలో నీళ్లు నింపాలని బీట్ ఆఫీసర్లకు ఆదేశాలు
- వేసవి నేపథ్యంలో అటవీ శాఖ చర్యలు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎండలు మండుతున్న నేపథ్యంలో అడవుల్లో సంచరించే జంతువుల దాహార్తిని తీర్చడానికి అటవీ శాఖ కదిలింది. వన్యప్రాణులు నీటి కోసం బయటకు రాకుండా సాసర్‌పిట్లను నింపడానికి చర్యలు చేపట్టింది. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు వెంటనే పనులు ప్రారంభించాలని జిల్లాలోని రేంజ్, సెక్షన్, బీట్ ఆఫీసర్లకు డీఎఫ్‌వో వికాస్ మీనా ఆదేశాలిచ్చారు. జిల్లా అటవీ విస్తీర్ణం 2,12,500 ఎకరాల్లో ఉంది. అడవులను సంరక్షించడానికి నిజామాబాద్ నార్త్, నిజామాబాద్ సౌత్, వర్ని, ఆర్మూర్, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ కలిపి మొత్తం ఏడు రేంజ్‌లను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. అయితే, జిల్లా వ్యాప్తంగా అడవుల్లో 183 సాసర్‌పిట్లను (నీటి గుంతలు) నిర్మించారు. కొన్ని చోట్ల నీళ్లు లేక వన్యప్రాణులు పంట పొలాలు, జనవాసాల్లోకి, రోడ్ల పైకి వస్తున్నాయి. ఈ క్రమంలో అవి ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి. ఒక్కోసారి దాహంతో ప్రాణాలు విడిచిన



సందర్భాలు లేకపోలేవు. ఇందుకు వర్షాలు కురిసే వరకు వారానికోసారి గుంతల్లో నీళ్లు పోయాలని సెక్షన్, బీట్ ఆఫీసర్లకు సూచించారు. వారం మధ్యలో ఒకసారి వచ్చి నీళ్లు ఉన్నాయో లేవో చూసుకుని ఎప్పుడు నిండుగా ఉంచాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. సాసర్‌పిట్లలో నీళ్లు పోయడానికి అధికారులు చేస్తున్న ప్రయత్నాలు అటవీ జంతువులకు ఎంతో మేలు చేస్తున్నాయి.

బిల్లులిస్తాం.. నీళ్లు పోయండి

ప్రతి వేసవిలో ఫారెస్టు అధికారులు సాసర్‌పిట్లలో నీటిని నింపాల్సి ఉంటుంది. ట్యాంకర్లతో అడవుల్లోకి వెళ్లి గుంతల్లో నీళ్లను పోయాలి. నెలలో కనీసం ఐదుసార్లయిన ఇలా చేయాలి. కానీ, చేసిన పనులకు బిల్లులు సక్రమంగా రావడం లేదు. దీంతో తమ జేబుల్లోంచి వెచ్చించిన ఫారెస్టు అధికారుల్లో కొంత అసంతృప్తి ఉంది. అయితే గతేడాది చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోయినా, ఈసారి కూడా గుంతల్లో నీటిని పోసేందుకు అటవీ అధికారులు సిద్ధమయ్యారు. బిల్లులు ఇస్తామని, అందుకు సంబంధించిన ఫొటోలతో పాటు ఇతర సాక్ష్యాలను సమర్పించాలని రాష్ట్ర అధికారులు జిల్లా అధికారులకు సూచించారు. బిల్లులు వస్తాయమనే నమ్మకంతో, జంతువులను కాపాడాలనే బాధ్యతతో సాసర్ పిట్లలో ప్రస్తుతం నీటిని నింపుతున్నారు.

ఆదేశాలిచ్చాం



రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాసర్ పిట్లలో నీటిని నింపాలని సిబ్బందిని ఆదేశించాం. దాహార్తితో ఏ ఒక్క జంతువు మరణించడానికి వీల్లేదు. వాటిని సంరక్షించడానికి అన్ని రకాల చర్యలు చేపడుతాం. వర్షాలు కురిసే దాకా నిరంతరంగా గుంతల్లో నీటిని నింపుతాం. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించం.

– వికాస్‌మీనా, జిల్లా అటవీ అధికారి, నిజామాబాద్

ప్రయాణికుల భద్రతకు చర్యలు

- 'మై ఆటో ఈజ్ సేఫ్' అమలుకు సన్నాహాలు
- ఆటో డ్రైవర్లు, ఓనర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: ఆటోల్లో వెళ్లే ప్రయాణికుల భద్రత కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీని కోసం మై ఆటో ఈజ్ సేఫ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ఆటో డ్రైవర్లు, ఓనర్లకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నారు. 2019లో రాష్ట్ర పోలీస్ శాఖ మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. అక్కడ విజయవంతం కావడంతో జిల్లాలో అమలు చేయడానికి పోలీసులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలోని ఆటో స్టాండ్‌ల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 25,809 ఆటోలు, 650 వరకు క్యాబ్‌లు ఉన్నాయి.

నమోదు ఇలా..

ఆటో డ్రైవర్లు, ఓనర్లు మై ఆటో ఈజ్ సేఫ్ అప్లికేషన్‌లో గాని, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గాని వివరాలను నమోదు చేసుకోవాలి. ఆటోకు సంబంధించిన ఆర్‌సీ, డ్రైవర్ లైసెన్స్, ఆధార్ కార్డ్, మరో అడ్రస్ ప్రూఫ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సమర్పించాలి. నమోదు చేసిన తర్వాత వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో



అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

ఆటోకు స్టీల్ నంబర్ ప్లేట్ తోపాటు రెండు క్యూఆర్ కోడ్‌కు చెందిన స్టిక్కర్లు ఇస్తారు. ఇందులో వివరాలు ఉంటాయి. క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన పెద్ద స్టిక్కర్‌ను ఆటో డ్రైవర్ సీటు వెనుక అతికిస్తారు. రెండో స్టిక్కర్ ఆటో ముందు లేదా వెనుక భాగంలో అతికిస్తారు. ప్రయాణికులు సదరు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటో వివరాలు వస్తాయి. అంతేకాకుండా ఏదైనా ఘటన జరిగితే పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆటోలను పట్టుకోడానికి ఈ నంబర్ ప్లేట్, స్టిక్కర్లు సాయపడతాయి.

ఆటో డ్రైవర్లకు సూచనలు

ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచిస్తున్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని చెబుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, డ్రైవర్ల పక్కన ఎవరిని కూర్చోపెట్టుకోవద్దని కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లు నమోదు చేసుకోవాలి

ఆటో డ్రైవర్లు, ఓనర్లు మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమంలో నమోదు చేసుకోవాలి. మై ఆటో ఇస్ సేఫ్ స్టిక్కర్లు ఉన్న ఆటోల్లోనే ప్రయాణికులు ఎక్కాలి. దీనిని ఆటో డ్రైవర్లు, ఓనర్లు తప్పని సరిగా చేసుకోవాల్సి ఉంటుంది.

– కిరణ్‌కుమార్, ఏసీపీ, నిజామాబాద్

అందరూ ఉండి అనాథలుగా..



- జీవిత చరమాంకంలో వృద్ధాశ్రమంలో..
- పండుటాకుల కష్టాలు

నిజామాబాద్ సిటీ: అందరూ ఉన్నా వీరు అనాథలుగా మారారు. కుటుంబ సభ్యులకు భారం కాకూడదని కొందరు.. కని పెంచిన పిల్లలు దూరం పెట్టిన వారు మరికొందరు వృద్ధాశ్రమంలో ఒంటరిగా బతుకుతున్నారు. తల్లిదండ్రులను జీవిత చరమాంకంలో సంతోషంగా చూసుకోవల్సిన బిడ్డలే దూరంగా పెడుతూ పేగు బంధాలను తెంపుకుంటున్నారు. దీంతో అందరు ఉన్న ఈ తల్లులు ఒంటరిగా ఆశ్రమంలో బతుకుతున్నారు. ముబారక్‌నగర్‌లోని ఆలంబన వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న తల్లులను మదర్స్ డే సందర్భంగా సాక్షి పలకరించింది. తాము వృద్ధాశ్రమానికి ఎందుకు వచ్చామో, ఏ పరిస్థితులలో వచ్చామో తెలుపుతూ వారు కన్నీటి పర్యంతమయ్యారు.

చూసేవారు లేక..



ఎనిమిది సంవత్సరాల క్రితం నాకు పక్షవాతం వచ్చింది. మాకు పిల్లలు పుట్టలేరు. 12 ఏళ్ల క్రితం భర్త చనిపోగా బంధువులు కొన్ని సంవత్సరాల వరకు బాగానే చూసుకునేవారు. కొన్నేండ్లు అయ్యాక నా వల్ల సమస్యలు వస్తున్నాయని గొడవలు మొదలయ్యాయి. నా మూలంగా గొడవలు జరుగ కూడదని, ఎవరికి భారం కాకూడదని వృద్ధాశ్రమానికి వచ్చాను. బంధువులు వీలున్నప్పుడు వచ్చి చూసి వెళ్తారు.

– గంగోణి కమలాబాయి

భర్త పోయాక ఒంటరయ్యా



నా భర్త రాజ్‌గోపాల్ ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసేవాడు. రెండేళ్ల ల క్రితం చనిపోయాడు. కూతురు గుండెనొప్పితో చనిపోయింది. మనవరాలి పెండ్లి చేశాక అత్తింటికి వెళ్లిపోయింది. ఒక తమ్ముడు ఉన్నాడు. నా బాగోగులు చూసేవారు లేక పోవటంతో కొద్ది నెలల క్రితం వృద్ధాశ్రమానికి వచ్చాను. మొన్నటివరకు బంధువుల మధ్య గడిపి ఇప్పుడు ఒంటరిగా బతకడం కష్టంగా ఉంది. ఇలాంటి జీవితం మరెవ్వరికి రాకూడదు.

– సీహెచ్ ప్రమీల, శివాజీనగర్

దేవుడి పిలుపు కోసం..



నాకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. అందరికి పెండ్లిలు చేశాను. కొడుకు హైదరాబాద్‌లో ప్రైవేట్‌లో పని చేస్తాడు. నన్ను చూసుకోవటం అతనికి కుదరటం లేదు. కూతుళ్ల జీవితాలు వారివి. కొడుకు రెండు నెలలకు ఒకసారి వచ్చి చూసివెళ్తాడు. మనుమండ్లు, మనుమరాళ్లు గుర్తుకు వస్తారు. ఏమిటి ఈ జీవితమంటూ ఏడుపు వస్తుంది. దేవుడి పిలుపు కోసం నిత్యం ఎదురు చూస్తుంటాను.

– నర్సవ్వ, వెల్మల్

అ'పూర్వ' సమ్మేళనం



గోపాల్‌పేట హైస్కూల్‌లో నాటి ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేట హైస్కూల్‌లో శనివారం 1980–81లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యా బుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులు విఠల్‌రెడ్డి, శ్యాంరావును పూర్వ విద్యార్థులు సత్కరించారు. పూర్వ విద్యార్థులు గఫార్, శ్రీనివాస్‌రెడ్డి, పండరి, వీరేశం, నారాగౌడ్ పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

నిజాంసాగర్: నిజాంసాగర్ మండల కేంద్రంలో వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన అంబయ్య (68) రెండ్రోజుల క్రితం కామారెడ్డి జిల్లా తాడ్వాయి లోని శబరిమాత ఆలయ దర్శనానికి వచ్చాడు. శనివారం తిరిగి వెళ్తూ నిజాంసాగర్ బస్టాండు ప్రాంతంలో ఎండవేడిమి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు వృద్ధునికి సపర్యలు చేసి ఓఆర్ఎస్ తాగించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వృద్ధుడు చేపోయాడు. మృతుని కుమారుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగగోని రాజు తెలిపారు.



వడదెబ్బతో స్పృహ తప్పిన వృద్ధుడికి సపర్యలు చేస్తున్న స్థానికులు

వివాహిత అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన విజయలక్ష్మి(41) అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. విజయలక్ష్మి ఒక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12న ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదన్నారు. బంధువులు, చుట్టూ పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



అమ్మకు నీరాజనం..



దివ్యాంగుడైన కొడుకు సైకిల్‌ను నెట్టుతున్న మాతృమూర్తి



అమ్మ ప్రేమ వెలకట్టలేనిది.. తన బిడ్డ కోసం తల్లి ఎంత కష్టమైన భరించి పెంచి పెద్ద చేస్తుంది. ఏడిస్తే పాలిస్తుంది.. లాలిస్తుంది. నిజామాబాద్ నగరంలో శనివారం తీసిన మాతృమూర్తుల చిత్రాలు..

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మోర్తాడ్: మోర్తాడ్ మండలం గాడ్లపేట్ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేల్పూర్ మండలం పడిగెల్‌కు చెందిన అబ్బుల అర్జున్(40) మరణించాడు. పడిగెల్ నుంచి మోర్తాడ్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆర్మూర్ వైపు వెళ్తున్న హైచర్ ఢీకొనడంతో ఘటన స్థలంలోనే మరణించాడు. మృతుడి తండ్రి గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యంరాజు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మద్నూర్: మండలంలోని మేనూర్ గ్రామానికి చెందిన మాధవరావు(24) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శనివారం ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు.. ఈ నెల 9న రాత్రి మేనూర్ గ్రామానికి చెందిన రాజు, శ్రీకాంత్, మాధవరావు బైక్‌పై డోంగ్లీ మండలంలోని మొగా గ్రామం వైపు వెళ్తుండగా రోడ్డుపై నిలిపి ఉన్న వడ్ల లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రాజు, శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలు కాగా మాధవరావుకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతు శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. ప్రమాదానికి కారణమైన లారీ యాజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి..

తాడ్వాయి: మండలంలోని దేమికలాన్‌కు చెందిన చుక్కా కృష్ణాగౌడ్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కృష్ణాగౌడ్ అనారోగ్యంతో బాధపడటంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 6న ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణాగౌడ్‌ను కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ తరలించారన్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కు తరలించారన్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య చుక్క భవాని ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మాక్లూర్: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి పది తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని కొత్తపల్లిలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్వ లీలావతి ఇంట్లో ఒక్కరే ఉండటంతో రాత్రి భోజనం చేసి ఇంటికి తాళం వేసి పక్కింటికి వెళ్లి నిద్రపోయింది. శనివారం ఉదయం ఇంటికి వెళ్లే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని 10 తులాల బంగారం పోయినట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

తాడ్వాయి: మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన కుర్ర సాయిలు(55) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రెండేళ్ల క్రితం సాయిలు కాలుకు దెబ్బతగిలింది. ఎన్ని ఆస్పత్రుల్లో చూపెట్టుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సాయిలు శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మనస్తాపం చెంది వివాహిత..



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో శనివారం రాత్రి ఓ వివాహిత మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. కమ్మర్‌పల్లిలో డాకూరి అరుణ(40), నర్సయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కొడుకు రతీష్, కూతురు నవిశ ఉన్నారు. నర్సయ్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లగా, అరుణ గృహిణిగా ఉంటుంది. అరుణకు ఐదు నెలల క్రితం ప్రమాదవశాత్తు కాలి విరిగింది. చికిత్స తీసుకుంటూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటోంది. అరుణకు కాలు విరగడం వల్ల తన పనులు తాను చేసుకోలేక ఇబ్బందులు పడుతోంది. ఈక్రమంలో మానసికంగా కుంగి పోయింది. మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంట్లోని కిటికికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.